
సాక్షి
బాపట్ల
శనివారం । 28 । జనవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 2,519 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,410 క్యూసెక్కులు వదిలారు.



దుర్గమ్మ సేవలో..

విజయవాడ: రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ శుక్రవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేడు ఆర్టీసీ స్థలాల లీజుపై సమావేశం

బాపట్ల టౌన్: చీరాల, ఇంకొల్లు, మార్టూరు, పర్చూరులోని ఆర్టీసీ ఖాళీ స్థలాలను 15 ఏళ్లకు లీజు ప్రాతిపదికన కేటాయించాలని నిర్ణయించామని బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దీనిపై శనివారం చీరాల ఆర్టీసీ డిపోలో సమావేశం నిర్వహించనున్నామని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం పరిధిలో స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, లాస్ట్‌గ్రేడ్ సర్వీసెస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ లిస్టును శుక్రవారం విడుదల చేశారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 31న సాయంత్రం 4 గంటల్లోపు లిఖిత పూర్వకంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో తెలియజేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ జె.హనుమంతరావు తెలిపారు. అభ్యర్థులు ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని వెల్లడించారు.

సమగ్రశిక్ష ఏపీసీగా విజయలక్ష్మి



గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త (ఏపీసీ)గా జి.విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా మర్రిపూడి మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆమెకు డెప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పించిన ప్రభుత్వం గుంటూరు జిల్లా సమగ్రశిక్ష ఏపీసీగా నియమించింది. కలెక్టరేట్ వద్ద ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని సమగ్రశిక్ష విభాగంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 569.10 అడుగుల వద్ద ఉంది. ఇది 254.3161 టీఎంసీలకు సమానం. కుడి కాలువకు 10,767, ఎడమ కాలువకు 8,367, ఎస్‌ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లోగా 21,854 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 21,854 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 842.00 అడుగుల వద్ద ఉంది. ఇది 64.9090 టీఎంసీలకు సమానం.

తెర తేజమున శోభిల్లి

● మరో మహానటి అస్తమయం ● జమున మన దుగ్గిరాల అమ్మాయే ● పూర్వీకులు మహారాష్ట్రీయులు



బాల్యస్నేహితురాలు కుసుమకుమారి, ఊర్వశి శారదతో జమున (ఫైల్)



దుగ్గిరాలలో తన బాల్యం గడచిన ఇంట్లో జమున (ఫైల్)

తెనాలి: గోదారీ గట్టుందీ.. గట్టుమీద చెట్టుందీ.. పిట్టమనసులో ఏముందీ? అంటూ కొంటెగా ప్రశ్నించినా, మావయ్యా నీ మొగుడెవరయ్యా అంటూ ఆట పట్టించినా, పల్లెటూరి పిల్లగా అమాయకంగా కనిపించినా, కలెక్టర్‌గా అధికార దర్పాన్ని ప్రదర్శించినా, ప్రేమించి వంచించిన మోసగాడిని వెంటాడి పగ తీర్చుకున్న కఠినాత్మురాలిగా హావభావాలు పలికించినా.. తనకెవరూ సాటిరారు అనిపించుకున్న నటి ఆంధ్రా నర్గీస్ జమున. సత్యభామగా ఆమె నటన ఓ సంచలనం. వినయం, ఒద్దికతో ఉండే ఆనాటి కథానాయిక పాత్రలకు అల్లరిని, చలాకీతనాన్ని అద్దిన నటశిరోమణి ఆమె. కోడెవయసు కొంటెతనం, పొగరు, వగరు కలగలసిన పాత్రలకు పెట్టింది పేరు. ఆరోజుల్లో ప్రేక్షకుల డ్రీమ్‌గర్ల్ అయిన జమునను అభిమానులు కళాభారతి, ప్రజానటి అని ప్రేమగా పిలుచుకునేవారు. ఆమెకు తెనాలితో విడదీయలేని అనుబంధం ఉంది.

ఇదీ నేపథ్యం



జమున పూర్వీకులు మహారాష్ట్రీయులు. తాతముత్తాతలు పీష్వా వంశీకులు. కర్ణాటకలోని హంపీలో పుట్టారు జమున. తల్లిదండ్రులు కౌసల్యాదేవి, నిప్పాని శ్రీనివాసరావు. హంపీలో పొగాకు ఎగుమతి వ్యాపారంలోంచి పసుపు వ్యాపారంలోకి మళ్లారు. ఫలితంగా పసుపు వ్యాపార కేంద్రమైన తెనాలి సమీపంలోని దుగ్గిరాలకు ఆ కుటుంబం వలస వచ్చింది. అప్పుడు జమునకు ఐదేళ్లు. తొలుత ఆమె పేరు జనాబాయి. జన్మనక్షత్రంరీత్యా ఏదైనా నది పేరు ఉండాలన్న సూచనతో జమునగా మార్చారు. దుగ్గిరాల రథం బజారులో నివాసం. అక్కడికి దగ్గర్లోని ప్రాథమిక పాఠశాలలో జమునను చేర్పించారు. కౌసల్యాదేవి తన కుమార్తెకు చదువుతో పాటు శాస్త్రీయ నృత్యం, సంగీతాన్ని నేర్పించారు.

హేమాహేమీలతో అనుబంధం

జమునకు 12–13 ఏళ్లు ఉన్నప్పుడు శ్రీరామనవమి ఉత్సవాల్లో పందిట్లో సాంస్కృతిక ప్రదర్శనలకు విజయవాడ నుంచి నటి సావిత్రి బృందం దుగ్గిరాలకు వచ్చింది. జమునకన్నా ఒకటి రెండేళ్లు సావిత్రి పెద్దది. స్నానపానాదులకు వసతి సరిపోక సావిత్రిని, మరొకమ్మాయిని జమున తన ఇంటికి తీసుకెళ్లారు. తర్వాత దేవదాసు సినిమాతో సావిత్రి పెద్ద నటి అయ్యారు. పుట్టిల్లు సినిమాలో నటించిన జమున బొమ్మను చూసిన సావిత్రి జమున ఇంటికి కారు పంపి పిలిపించుకుని ఎంతో ఆదరంగా చూశారు. అప్పట్నుంచి వారిద్దరూ మంచి స్నేహితులుగానే కొనసాగారు. సినిమారంగానికి వెళ్లిన తర్వాత జగ్గయ్య, గుమ్మడి, కృష్ణ, శారదలతో జమునకు అనుబంధం కొనసాగింది. పుట్టిల్లు సినిమాలో ఒక సన్నివేశాన్ని తెనాలిలోనే కాలువ ఒడ్డున చిత్రీకరించారు. భర్త జువాలజీ ప్రొఫెసర్ జూలూరి రమణరావుతో కలిసి దుగ్గిరాలలోని శివాలయంలో నవగ్రహ మంటపాన్ని నిర్మించారు జమున. ఆమె 1985లో మంగళగిరి అసెంబ్లీకి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు చేతిలో ఓటమిపాలయ్యారు.

రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్య ఏర్పాటు

రంగస్థలంపై మమకారంతో రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్యను ఏర్పాటుచేశారు జమున. పేద కళాకారులకు పింఛన్లు, సురభి, నాటక సమాజాలకు ప్రోత్సాహం అందించేవారు. బళ్లారి రాఘవ పేరిట తపాల బిళ్ల విడుదల ఆమె హయాంలో జరిగినదే. అందుచేత కళాకారుల్లోనూ జమునపై కృతజ్ఞత ఉంది. తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీచే 2009లో నిర్వహించిన తొలి అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో జమునను ఘనంగా సత్కరించారు. 2018లో పోలేపెద్ది నరసింహారావు, తుమ్మల వెంకట్రామయ్య, ఎన్టీఆర్ కళాపరిషత్ 9వ రాష్ట్రస్థాయి నాటికల పోటీల్లో జమునకు ఎన్టీఆర్ పురస్కారం ప్రదానం చేశారు. ఆ తర్వాత మళ్లీ జమున తెనాలి వచ్చిన సందర్భం లేదు. ఆమె లేరన్న వార్త మాత్రం శుక్రవారం తెల్లవారే చేరింది. అభిమానుల్లో పుట్టెడు దుఃఖాన్ని నింపింది.

కళా ప్రవేశం ఇలా..

జమున కుటుంబ సభ్యులతో కలిసి సినిమాలు చూసేందుకు తెనాలి వచ్చేవారు. క్రమంగా తెనాలి ప్రాంత కళా వారసత్వం అబ్బింది. దుగ్గిరాలలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతుండగా ప్రజానాట్యమండలి 'మా భూమి' నాటకం ఆడే అవకాశం వచ్చింది. పాత్రలో రాణించటంతో చాలా ప్రదర్శనలిచ్చారు. రంగస్థలం నుంచి గరికపాటి రాజారావు తీసిన 'పుట్టిల్లు' సినిమాతో జమున వెండి తెరంగేట్రం చేశారు. అప్పట్లో తన పారితోషికం నెలకు రూ.500. ఆ రోజుల్లో అదే ఎక్కువ. మకాం చెన్నైకు మారింది. సినీప్రస్థానం కొనసాగింది. చదువుకుని, నటనలో ఓనమాలు దిద్దిన దుగ్గిరాలనే తన సొంత ఊరుగా భావిస్తానని జమున చెప్పేవారు.



దుగ్గిరాల శివాలయంలో జమున పూజలు (ఫైల్)

ఘోర రోడ్డు ప్రమాదం

● ఇద్దరు చిన్నారులు మృతి
● 8 మందికి గాయాలు
● నవ వరుడితో కలిసి పెళ్లికి వెళ్తుండగా దుర్ఘటన





గోనుగుంట్ల హరీష్(ఫైల్) లింగా జస్విత (ఫైల్)

మాచర్ల: వరుని కుటుంబ సభ్యులు పెళ్లికి వెళ్తుండగా జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు దుర్మరణం పాలయ్యారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. శుక్రవారం ఈ దుర్ఘటన వెల్దుర్తిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దుర్గి మండలం ముటుకూరుకు చెందిన వరుడు జల్లెలమూడి వీరబాబు పెళ్లిని వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం చేయాలని పెద్దలు నిశ్చయించారు. దీంతో అతడితోపాటు కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం 6.30 గంటలకు స్వగ్రామంలో మూడు వాహనాల్లో బయలుదేరారు. మార్గ మధ్యలో వెల్దుర్తి పెట్రోల్ బంకు వద్ద ముందు వెళ్తున్న స్కార్పియో వాహనం ఎదురుగా ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. స్కార్పియోలో ప్రయాణిస్తున్న ఇద్దరు చిన్నారులు గోనుగుంట్ల హరీష్ (12), లింగా జస్విత (3)తోపాటు జిల్లలమూడి వెంకటరమణ, గోనుగుంట్ల రమణ, బోయపాటి సుజాత, లింగా లక్ష్మి, లింగా పెద్దమ్మ, డ్రైవర్ చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో గోనుగుంట్ల హరీష్, లింగా జస్విత మరణించారు. మిగిలిన వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో నర్సరావుపేట జీబీఆర్ ఆసుపత్రికి తరలించారు. మాచర్ల రూరల్ సీఐ షేక్ షమీముల్లా, రూరల్ ఎస్ఐ రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో స్కార్పియోలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



హరీష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే

1,01,786 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,01,786 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 99,132 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది.

నేరస్తుల కదలికలపై నిఘా

● చోరీ కేసుల నియంత్రణకు చర్యలు
● మహిళలపై నేరాల కట్టడికి ప్రత్యేక దృష్టి
● నేర సమీక్షలో ఎస్పీ వకుల్‌జిందాల్



సమీక్ష అనంతరం చీరాల 1టౌన్ సీఐకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్



సమీక్షకు హాజరైన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు

బాపట్లటౌన్: నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ అధికారులతో ఆయన నేర సమీక్ష నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. పోక్సో కేసులు, మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు సంబంధిత కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. చోరీలు, దారి దోపిడీ, చైన్ స్నాచింగ్ ఇతర ఆస్తి నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రదేశాల్లో రాత్రి, పగలు గస్తీ పెంచాలన్నారు.

సారాను నిర్మూలించాం : గత ఏడాది జిల్లాలో సారా స్థావరాలపై దాడులు చేశామని, అనేక ప్రాంతాల్లో సారాను నిర్మూలించామని ఎస్పీ గుర్తుచేశారు. మత్తుపదార్థాలకు విద్యార్థులు బానిసలవుతున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలని చెప్పారు. ఫిబ్రవరిలో జరగనున్న లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సూచించారు. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లా డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.మధుసూదనరావు పాల్గొని వివిధ కేసుల దర్యాప్తులో పోలీస్ అధికారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.చారుమతి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిహెచ్.పద్మ, డీసీఆర్‌బీ డీఎస్పీ జి.లక్ష్మయ్య, బాపట్ల డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, ఏఆర్ డీఎస్పీ ఎం.డి.హెచ్.ప్రేమ్‌కుమార్, ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ ఎ.వి.రమణ పాల్గొన్నారు.

ఉత్కంఠ.. సమష్టిగా గెలుపు బాట

Regional sponsor
District sponsor

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP
SPL SAKSHI PREMIER LEAGUE
APMDC | APMDC FOUNDATION
VIVA THE SCHOOL BY VVIT

● హోరాహోరీగా సాక్షి ప్రీమియర్ లీగ్ ● జట్టుగా రాణించిన విజేతలు

నరసరావుపేట రూరల్: సాక్షి ప్రీమియర్ లీగ్ పోటీలు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల క్రీడామైదానంలో హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఎన్ఈసీ క్రీడా మైదానంలో మూడో రోజు మూడు మ్యాచ్‌లు జరిగాయి. మ్యాచ్‌లకు అంపైర్లుగా పి.అజయ్, కె.నవీన్‌రెడ్డి, జె.కోటేశ్వరరావులు వ్యవహరించారు. ఎన్ఈసీ కళాశాల పీడీ ఎల్.కృష్ణారెడ్డి, నిట్ కళాశాల పీడీ రాజేంద్రబాబులు మ్యాచ్‌లు పర్యవేక్షించారు.

నేటి మ్యాచ్‌లు...

సాక్షి ప్రీమియర్ లీగ్ పోటీల్లో భాగంగా నాల్గవ రోజు శనివారం నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో మూడు మ్యాచ్‌లు జరగనున్నాయి. మొదటి మ్యాచ్ కళ్లం హరనాథరెడ్డి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–కృష్ణవేణి డిగ్రీ కళాశాల, రెండవ మ్యాచ్ ఆర్‌వీఆర్‌జేసీ – తిరుమల ఇంజినీరింగ్ కళాశాల, మూడవ మ్యాచ్ నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల– ఈశ్వర ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరగనున్నాయి.

బాపట్ల.. విజయ బావుటా



తొలి మ్యాచ్ విజేత బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల జట్టు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాయి(నాలుగు వికెట్లు)

పోటీల్లో భాగంగా శుక్రవారం తొలిమ్యాచ్ బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల(నిట్) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి నిట్ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన బాపట్ల కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఐదువికెట్ల నష్టానికి 93 పరుగులు సాధించింది. బాపట్ల కళాశాల బ్యాట్స్‌మెన్స్ గంగాధర్–20, విజయ్–16పరుగులు సాధించారు. నిట్ కళాశాల బౌలర్లు అమర్–2, వేణు–1 వికెట్ దక్కించుకున్నారు. అనంతర బ్యాటింగ్ దిగిన నిట్ కళాశాల నిర్ణీత 10ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 83 పరుగులు చేసి ఓటమి పాలయింది. నిట్ కళాశాల ఓపెనర్ సర్ఫరాజ్ 17 బంతుల్లో 39 పరుగులతో మెరుపులు మెరిపించాడు. సర్ఫరాజ్ అవుట్ కావడంతో బ్యాట్స్‌మెన్స్ పెవిలియన్‌కు క్యూకట్టారు. 'బాపట్ల' బౌలర్ నాలుగు వికెట్లు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కించుకున్నాడు.

దేనికైనా 'రెడ్డి'..



రెండో మ్యాచ్ విజేత ఎస్‌కేఆర్‌బీఆర్(రెడ్డి కళాశాల) జట్టు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ హేమంత్

ఎస్‌కేఆర్‌బీఆర్ డిగ్రీ కళాశాల(రెడ్డి కళాశాల), విట్ యూనివర్సిటీ జట్ల మధ్య జరిగిన రెండవ మ్యాచ్‌లో రెడ్డి కళాశాల ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన రెడ్డి కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 100 పరుగులు సాధించింది. జట్టులోని హేమంత్–34, జానీబాషా–24 పరుగులు సాధించాడు. విట్ యూనివర్సిటీ బౌలర్లు రిత్విక్, శ్రావణ్‌లు ఒక్కోవికెట్ సాధించారు. అనంతరం బ్యాటింగ్ దిగిన విట్ యూనివర్సిటీ జట్టు లక్ష్య ఛేదనలో తడబడింది. 10 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసి 28 పరుగులు తేడాతో ఓటమి పాలయింది. జట్టులోని మల్లేష్ అత్యధికంగా 17 పరుగులు చేశాడు. రెడ్డి కళాశాల బౌలర్లు తౌఫిక్ నాలుగు వికెట్లు సాధించాడు. 36 పరుగులు సాధించిన రెడ్డి కళాశాల బ్యాట్స్‌మెన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు.


ఎస్ఆర్ఎం 'జయం'త్..



మూడో మ్యాచ్ విజేత ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ జయంత్

జేఎన్‌టీయూఎన్ కళాశాల –ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్ల మధ్య మూడవ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన జేఎన్‌టీయూఎన్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 54పరుగులు చేసి ఆరు వికెట్లు కోల్పోయారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టు బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. దీంతో జేఎన్‌టీయూఎన్ బ్యాట్స్‌మెన్స్ పరుగులు సాధించేందుకు తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది. జట్టులోని గోపి అత్యధికంగా 15 పరుగులు చేశాడు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ బౌలర్ ఆకాష్ అత్యధికంగా మూడు వికెట్లు పడగొట్టాడు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ బ్యాట్స్‌మెన్‌ల కేవలం 5.3ఓవర్లలో వికెట్ నష్టపోయి 55పరుగులు చేసి విజయం సాధించారు. ఓపెనర్ జయంత్ 21 బంతులలో 40 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అత్యధిక పరుగులు చేసిన జయంత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.

1న వేదవ్యాస విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



అమరావతి: వేద వ్యాస భగవానుడి ఆరాధనకు మండలంలోని వైకుంఠపురం భవఘ్ని ఆరామం సమీపంలో వ్యాస సనాతన ధర్మక్షేత్రాన్ని నిర్మించామని భవఘ్ని గురూజీ చెప్పారు. శుక్రవారం ఆయన వ్యాస ఆలయ నిర్మాణం గురించి వివరించారు. పవిత్ర కృష్ణానదీ తీరాన సువిశాల ప్రదేశంలో మూడు అంతస్తులుగా నిర్మించిన ఈ ఆలయం సెల్లార్‌లో భగవాన్ వేదవ్యాసుని పురాణాలు, గ్రంథాలు విగ్రహాలు, చిత్రాలతో గ్యాలరీని, డిజిటల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. మొదటి అంతస్తులో ఆడిటోరియం నిర్మించామని, రెండో అంతస్తులో సుమారు 9 అడుగుల భగవాన్ వేదవ్యాసుని విగ్రహంతో ఆలయాన్ని అత్యద్భుతంగా నిర్మించామని పేర్కొన్నారు. మూడో అంతస్తులో అఖండజ్యోతిని భక్తులు నిత్యం దర్శించుకునేలా నిర్మాణం చేశామని వెల్లడించారు. ఫిబ్రవరి 1న భీష్మ ఏకాదశి నాడు వ్యాస మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వివరించారు.

శింగరకొండలో హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు



హైకోర్టు జడ్జి దంపతులకు చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి హైకోర్టు జడ్జి జ్యోతిర్మయి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం దేవస్థాన అధికారులు జడ్జి దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

మృతదేహం గుర్తింపు

అద్దంకి: భవనాశి కాలువలో లభించిన వృద్ధుడి మృతదేహం పట్టణంలోని రామకృష్ణాపురానికి చెందిన చలివేంద్రం నరసింహంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ ప్రవీణ తెలిపిన వివరాలు.. నరసింహం చేపల వేటతో జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలో మాదిరిగా ఆయనే తిరిగి ఇంటికి వస్తాడని భావించిన భార్య కోటేశ్వరమ్మ, ముగ్గురు పిల్లలు తెలిసిన బంధువులను విచారించారు. కాలనీకి సమీపం నుంచి వెళ్లే భవనాశి కాలువలో వేలమూరిపాడు వద్ద వృద్ధుడి మృతదేహం పోలీసులు గుర్తించినట్లు తెలుసుకున్నారు. శుక్రవారం మృతదేహాన్ని భార్య, కుమారులు పరిశీలించగా, చేతికి కట్టుకున్న దారం, లుంగీ ఆధారంగా గుర్తించారని ఎస్ఐ తెలిపారు. బహుశా కాలువలో జారి పడి మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించి, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ సలహాదారు నాగార్జునరెడ్డి

అద్దంకి రూరల్: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ సలహాదారు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దీనిద్వారా ప్రతి కుటుంబంలో రూ.1లక్ష నుంచి రూ.6 లక్షల వరకు లబ్ధి పొందారన్నారు. ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా పథకాలు ఎక్కడా ఆపలేదన్నారు. ప్రభుత్వానికి పేరు తెచ్చేలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అద్దంకి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఏపీవో, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మరో కూలీ మృతి

జాగర్లమూడివారిపాలెంలో విషాదఛాయలు



ఒంగోలులో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శిస్తున్న గరటయ్య

జే.పంగులూరు: మండల పరిధిలోని జాగర్లమూడి వారిపాలెం జాతీయ రహదారిపై గురువారం జరిగిన కూలీల మినీ ట్రక్ బోల్తాలో మరో కూలి శుక్రవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. రెండో రోజు అందిన సమాచారం ప్రకారం గురువారం జరిగిన కూలీల రోడ్డు ప్రమాదంలో మరణాల సంఖ్య పెరిగే విధంగా ఉందని తెలుస్తుంది. మొదటి రోజు ఒంగోలులో రిమ్స్‌లో చికిత్స పొందుతూ నంబూరి రంగమ్మ(65) మృతి చెందింది. శుక్రవారం పాన్నూరి రామతీర్థం(45) చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో బాధితురాలు కల్లూరి నాగమణి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. ప్రస్తుతం ఒంగోలు రిమ్స్‌లో 16 మంది కూలీలు గాయాలతో చికిత్స పొందుతున్నారు. మరో ఇద్దరు కూలీలు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కూలీల మృతదేహాలను శుక్రవారం స్వగ్రామం అయిన జాగర్లమూడివారిపాలెం చేరాయి. మృతదేహాలు చూసి తోటి కూలీలు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఒంగోలులో చికిత్స పొందుతున్న కూలీలను శుక్రవారం మాజీ శాసన సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాచిన చెంచుగరటయ్య పరామర్శించారు. ఆయనతో పాటు గ్రామ నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, జాగర్లమూడివారిపాలెం నాగేశ్వరరావు, ఉమామహేశ్వరావు, విజయ్‌కుమార్ తదితర నాయకులు ఉన్నారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి హనుమంతరావు



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎం.హనుమంతరావు తదితరులు

బాపట్ల టౌన్: పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి ఎం.హనుమంతరావు తెలిపారు. జిల్లా పశుసంవర్ధక కార్యాలయంలో నాన్ గ్రాడ్యుయేట్ సిబ్బంది జిల్లాస్థాయి సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. తొలుత నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరేరియన్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. డాక్టర్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ సమీకృత దాణా ఆవశ్యకతను, ఏడాదికి ఒక దూడ, లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పెయ్యదూడల ఉత్పత్తి పథకంపై అవగాహన కల్పించారు. కె.శ్రీనివాసరావు అధ్యక్షతన తొమ్మిది మందితో కూడిన నూతన తాత్కాలిక జిల్లా నాన్ గ్రాడ్యుయేట్ వెటరినేరియన్ ఫెడరేషన్ కార్యవర్గం ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.సేవా నాయక్, రాష్ట్ర మాజీ అధ్యక్షులు రామారావు, ఉమ్మడి గుంటూరు జిల్లా చైర్మన్ కె.రాజమోహన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్. విజయ సారథి, ఎల్ఎస్ఏ సెక్రటరీ కె.రంజిత, రాష్ట్ర వీఏ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.రవి కుమార్, పల్నాడు జిల్లా చైర్మన్ శ్రీ.ఎ.రాంబాబు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్

- వృద్ధుడి ప్రాణాలు కాపాడిన వైద్యులు
- సుమారు రూ.4లక్షల విలువైన ఆపరేషన్ ఆరోగ్య శ్రీలో ఉచితం

గుంటూరు మెడికల్: గ్యాస్ట్రోడ్యూడెనల్ ఇంటస్సస్సెప్షన్ విత్ డ్యూడెనల్ పాలిప్ (కడుపు భాగం చిన్నపేగు మొదటి భాగంలోకి టెలిస్కోపువలే చొచ్చుకునిపోవడం) అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న 65 ఏళ్ల వృద్ధుడికి గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ రెండో యూనిట్ వైద్యులు సకాలంలో ఆపరేషన్ చేసి పునర్జన్మనిచ్చారు. శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జనరల్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గుంటూరు శ్రీనివాసరావుతోటకు చెందిన టి.ఎర్రబాబు గత 15 సంవత్సరాలుగా కడుపులో మంట, పొట్ట బిగపట్టడం, అన్నం తినలేకపోవడం, అన్నం మింగుడుపడకపోవడం, సడన్‌గా ఊపిరి అందకపోవడం, ఆకలి లేకపోవడం, విపరీతంగా తేపులు రావడం, తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం, ఎసిడిటీ, నిద్రపట్టకపోవడం వంటి లక్షణాలతో బాధపడుతున్నాడు. డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు డిసెంబరు 22న ఎర్రబాబుకు సుమారు మూడున్నర గంటల సేపు ఆపరేషన్ చేసి 15 ఏళ్ల అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టారు. వైద్య పరిభాషలో ఈ వ్యాధిని గ్యాస్ట్రో డ్యూడెనల్ ఇంటస్సస్సెప్షన్ విత్ డ్యూడెనల్ పాలిప్ అంటారని డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యాధునిక వైద్య పరికరాలను, వైద్య విభాగానికి అందించడం వల్ల అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లు సైతం చాలా సులువుగా చేయగలుగుతున్నామన్నారు. సుమారు రూ. 4లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా పూర్తిగా ఉచితంగా చేశామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటు డాక్టర్ రమణాచలం, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నాగసంతోష్, డాక్టర్ వంశీధర్, డాక్టర్ నిఖిల్, డాక్టర్ కిషోర్, మత్తు వైద్యులు డాక్టర్ మహేష్‌బాబు, డాక్టర్ ఆనందబాబు, డాక్టర్ నికోలస్, డాక్టర్ కీర్తి, డాక్టర్ ప్రభు, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డాక్టర్ నాగూర్‌బాషా, డాక్టర్ శివరామకృష్ణ పాల్గొన్నట్లు వెల్లడించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టి.. ఒకరి మృతి



అద్దంకి: పుట్టిన రోజు వేడుక కోసం మోటార్ బైక్‌పై వెళ్తున్న యువకులు ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అద్దంకి పట్టణ శివార్లలోని కలవకూరు రోడ్డు ఇటుక బట్టీల వద్ద శుక్రవారం జరిగింది. స్థానికులు బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మార్టూరు మండలం వలపర్లకు చెందిన వంశీ పుట్టిన రోజు సందర్భంగా స్నేహితులు నారాయణ మనోహర్, ప్రభు (17)తో కలసి అద్దంకి బయలుదేరారు. ఈ క్రమంలో బైకు అద్దంకి మండలం కలవకూరు రోడ్డులోని బట్టీల వద్దకు రాగానే రోడ్డు క్రాస్ చేస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రభు తీవ్రగాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందాడు. వంశీ, నారాయణమనోహర్‌కు ఎడమ కాళ్లు విరిగిపోయాయి. ప్రభు స్వగ్రామం చిలకలూరిపేట కాగా వరపర్లలోని అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది, వారిని తొలుత అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

'స్కిల్స్' పెంపుదలకు కృషి

గుంటూరు వెస్ట్: నిరుద్యోగ యువత ఉపాధి మార్గాలు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ పెంచడం ద్వారా వివిధ సంస్థలు జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా నిర్వహించే ఇంటర్వ్యూల్లో ప్లేస్‌మెంట్స్ పొందుతున్నారన్నారు. దీంతోపాటు బ్యాంకు రుణాలను కూడా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి బాలికలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నామన్నారు.